క్లుప్తంగా

వుడ్ విల్లా బాగు

యూఏఈ బృందం కితాబు



వుడ్ విల్లా వద్ద యూఏఈ బృందం సభ్యులు

మహేశ్వరం: మండలంలోని తుమ్మలూరులో నిర్మించిన కెనడియన్ వుడ్ విల్లాను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ బహుళ వ్యాపార కంపెనీ మార్గన్ గ్రూపు బృందం ఆదివారం సందర్శించింది. మ్యాక్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన వుడ్ విల్లాను మార్గన్ గ్రూప్ సీఈఓ, డెవెలపర్ అబ్దుల్లా ఆల్, అబ్దౌలీ, రీజినల్ సేల్స్ డైరెక్టర్ హర్షేంద్ర గోయల్, గ్రూప్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ జార్జియోస్, కర్రైస్కోస్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు వుడ్ విల్లా బాగుందని కితాబు ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని వుడ్ విల్లాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మ్యాక్ ప్రాజెక్ట్ ఎండీ మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఆదివారం మాడ్గుల మండలానికి చెందిన జగన్‌గౌడ్, సంతోష్ పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు చెప్పిన విధంగా అన్ని హామీలను నెరవేర్చడమే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, విజయ్, బాబా తదితరులు ఉన్నారు.

'ఆయుష్మాన్ భారత్'తో ఆరోగ్య భద్రత

దిల్‌సుఖ్‌నగర్: ఆయుష్మాన్ భారత్‌తో ప్రధాని నరేంద్రమోడీ నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పించారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ఆదివారం ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన లబ్ధిదారుల నమోదు కార్యక్రమం ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించటం అఖండ భారతవనిలో అతి పెద్ద ఆరోగ్య స్కీమ్ అన్నారు. దీని కోసం ఏటా కేంద్ర ప్రభుత్వం రూ. 8,800 కోట్లకుపైగా కేటాయిస్తుందన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో నివసించే పేదలు, మధ్య తరగతి, వేతన జీవులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ ధీరజ్ రెడ్డి, పిట్ట ఉపేందర్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, నేతలు కొట్టం వెంకటేశ్, శ్రీనివాస్, రమేశ్ గౌడ్, సరూర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు సిద్దూ ముదిరాజ్, మహిళామోర్చా నాయకురాళ్లు కరుణ, షకీరా బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వనస్థలిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం జనప్రియ హోమ్స్ కాలనీలో శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ కమిటీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్లోబల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీపీ, షుగర కార్డియాక్, పిడియాట్రీషియన్, గైనిక్, దంత సమస్యలపై పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. మహిళా మండలి అధ్యక్షులు పి.జ్యోతిసాయి, ఉపాధ్యక్షులు కె.రమ, పి.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి డి.పద్మావతి, సంయుక్త కార్యదర్శి ఎం.మమత, కోశాధికారిలు కె.భాగ్యలక్ష్మి, వి.శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎదుట ధర్నా

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా సోమవారం ఆమనగల్లు పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రముఖులు హాజరవుతున్నారని ఆయన చెప్పారు.

హోలీకి పిట్టలగూడెం సిద్ధం

తరలిరానున్న వేలాది మంది నక్కల పిట్టలోళ్లు

పహాడీషరీఫ్: రంగుల హరివిల్లు హోలీ వేడుకల కోసం జల్‌పల్లి పిట్టల గూడెం సిద్ధమవుతోంది. హోలీ పండుగను పురస్కరించుకొని తెలంగాణ జిల్లాలతో పాటు నగరంలోని అన్ని పార్ధివాడలకు చెందిన నక్కల పిట్టలోళ్లు ఇక్కడే హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇంటిల్లిపాది విచ్చేసి నాలుగు రోజుల పాటు ఇక్కడే గడుపుతారు. వేలాదిగా తరలివచ్చే వారితో ఈ ప్రాంతమంతా జన జాతరను తలపిస్తుంది. ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న వేడుకలను పురస్కరించుకొని ఇప్పటి నుంచే పిట్టల గూడెంకు విచ్చేస్తున్న పార్ధిలు తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకుంటుండడంతో పాటు తమ పూర్వీకుల సమాధులకు రంగులు దిద్దడంలో నిమగ్నమయ్యారు. ఈ వేడుకల్లో తమ ఆరాధ్య దైవాలు, కుల యువతి అమీర్‌బాయి సమాధికి పూజలు నిర్వహించడం జరుగుతుంది.

వంశ పూజే ప్రధాన ఘట్టం

వంశ పూజలు చేయడం ఈ హోలీ వేడుకలలో ప్రత్యేక ఘట్టంగా చెప్పుకోవచ్చు. హోలీకి ముందు రోజు రాత్రి పెద్ద ఎత్తున కామ దహనం చేసి.. హోలీ రోజున రంగులు దిద్దుకొని స్థానికంగానే ఉన్న జల్‌పల్లి పెద్ద చెరువులో స్నానమాచరిస్తారు. నక్కల పిట్టలోళ్లు కులంలోని శక్తి, చౌకట్, నౌకడ్, కాలివాలా, ఇస్లీవాలా తదితర వంశాల ప్రజలే అధికంగా ఉంటారు. వీరంతా ఇక్కడే వంశపూజ నిర్వహిస్తారు. ఈ వంశ పూజలో ఒక్కో కుటుంబం మూడు నుంచి ఆరు పొట్టేళ్లను బలిచ్చి వేడుకలు నిర్వహిస్తారు. మొత్తం మీద దాదాపు వెయ్యి వరకు పొట్టేళ్లను ఈ వేడుకల సందర్భంగా కోయనున్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పహాడీషరీఫ్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ ఎస్ వసంత పర్యవేక్షణలో నీరు, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటారు.

నిజాం నవాబును ఆకర్షించిన అమీర్‌బాయి

ఉత్తరాది రాష్ట్రాల నుంచి నిజాం నవాబుల హయాంలో వలస వచ్చిన నక్కల పిట్టలోళ్లు జల్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో కుందేళ్లు, పక్షుల వేట వృత్తిని కొనసాగిస్తూ జీవనం కొనసాగించే వారు. ఆ సమయంలోనే జల్‌పల్లి అడవికి వేట కోసం విచ్చేసిన నిజాం నవాబుకు ఈ తెగకు చెందిన అమీర్‌బాయి అనే యువతి తీయని ఫలాలను అందజేసింది. ఆ ఫలాలను ఆస్వాధించిన నిజాం నవాబు ఆ యువతిపై ప్రేమను సైతం కోరాడు. దీనికి ఆమె అంగీకరించిన నేపథ్యంలోనే అప్పటి నుంచి నిజాం నవాబుకు నక్కల పిట్టలోళ్లు పండ్లను అందజేస్తూ అప్పటి నుంచే పండ్ల వృత్తిని కొనసాగిస్తున్నారని కుల పెద్దలు వెల్లడిస్తున్నారు. అమీర్‌బాయి స్నానం కోసం కొలను తవ్వించి భూగర్భంలోనే రాతి కట్టడంతో స్నానాల గదులను నిర్మించాడు. 40 ఏళ్ల లోపే మృతి చెందిన అమీర్‌బాయిని కొల నుకు సమీపంలోనే ముస్లిం, పార్థిల సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేసి సమాధి నిర్మించారు. ఇక్కడే నక్కల పిట్టలోళ్లు నివాసం ఉండేందుకు అప్పట్లో నిజాం నవాబు వందల ఎకరాల భూమిని ఇనామ్‌గా ఇచ్చారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఇక్కడ హోలీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. హోలీ మరుసటి దినం అమీర్‌బాయి సమాధి వద్ద ఈ కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ప్రాచీన చరిత్ర.. పిట్టల గూడెం సొంతం

కొన్ని దశాబ్దాల క్రితం వరకు జల్‌పల్లి పిట్టలగూడెం నిత్యం ప్రజలతో కళకళలాడేది. ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని స్థానికంగా తోటలలో సీతాఫలాలతో పాటు ఇతర పండ్లను పండించే వారు. కాలక్రమేణా ఇక్కడి నుంచి ఒక్కొక్కరుగా బయల్దేరి నగరంలోని వివిధ ప్రాంతాలలో పార్ధివాడలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిన వారు ప్రస్తుతం పాతబస్తీ పురానాపూల్, లాల్‌దర్వాజా, రాజన్నబావి, శంషీర్‌గంజ్, ఛత్రినాక హమాంబౌలి, డబీర్‌పురా, సరూర్‌నగర్, కాచిగూడ, అమీర్‌పేట, ఆబిడ్స్, బేగం బజార్, బోయిగూడ, చిక్కడపల్లి, ఎల్.బి.నగర్, మోజంజాహి మార్కెట్, గన్‌ఫౌండ్రీ, వరంగల్, నిజామాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు తరలివెళ్లి నివాసం ఉంటున్నారు. ఇప్పటికీ ఆయా కుటుంబాలలో ఎవరూ మృతి చెందినా జల్‌పల్లి పిట్టల గూడెంకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తారు.



స్నానాల కోసం నిజాం నవాబు నిర్మించిన కొలను



అమీర్‌బాయి సమాధి

అమీర్‌బాయి పేరు మీదుగానే..



ప్రతి ఏటా హోలీ వేడుకలు పిట్టల గూడెంలో నిర్వహిస్తాం. మూడు రోజుల ముందే ఇంటిల్లిపాది విచ్చేసి గుడారాలు ఏర్పాటు చేసుకొని తమ పూర్వీకుల సమాధులను అలంకరించుకుంటాం. తమ తాతల కాలం నుంచి అమీర్‌బాయి పేరు మీదనే హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

– శంకర్, పహాడీషరీఫ్

సదుపాయాలు కల్పిస్తాం



హోలీ సందర్భంగా పార్ధివాడలో అన్ని సదుపాయాలు కల్పిస్తాం. పారిశుద్ధ్యం, నీటి సదుపాయాల విషయమై ఇప్పటికే మున్సిపాలిటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ఏడాదికోమారు వారం రోజుల పాటు మా గ్రామంలో ఉండే పార్ధీల పట్ల ఆప్యాయతను కొనసాగిస్తాం.

– యాదగిరి, కౌన్సిలర్, జల్‌పల్లి

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్

కడ్తాల్: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామరావు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన ఈనెల 8న మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సలహాలు, సూచనలు తీసుకోని ముందుకు సాగడమే ధ్యేయంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళన కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ప్రతినిధులతో పాటు ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్ హాజరవుతున్నట్లు తెలిపారు. ముద్విన్, చరికొండ, పల్లెచెలక, గోవిందాయిపల్లి, గోవిందాయిపల్లి తండా, మర్రిపల్లి, ఎక్వాయిపల్లి, అన్మాస్‌పల్లి గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు మండలంలో పార్టీ బూత్ కమిటీలు, ఇన్‌చార్జిలను నియమించుటకై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్‌కు ఆదివారం ఓటర్ లిస్టును ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిలు తదితరులు ఉన్నారు.



పరమేశ్‌కు ఓటర్‌లిస్ట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

చదువుతో ప్రపంచాన్ని జయించవచ్చు

బడంగ్‌పేట్: చదువును పట్టుకొని పరుగెడితే ప్రపంచాన్ని జయించవచ్చని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సూచించారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి వారి చదువుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతసేపు మా పిల్లలు చదవడం లేదు అని ప్రతిసారి ఉపాధ్యాయులను నిందించడం కంటే తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులపై బాధ్యత వహించాలని ఇబ్రాం శేఖర్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పేరెంట్స్ టీచర్ మీటింగ్‌ల గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడం లేదని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన ఎలా ఉందో తల్లిదండ్రులు చెక్ చేయడం లేదన్నారు. ఇలా అయితే భవిష్యత్తులో పిల్లల ఎలా ఎదుగుతారని తల్లిదండ్రులకు సూచించారు. మాకు చదువు రాదని, కూలీ పనులకు వెళతామని చెప్పి భవిష్యత్తు కలిగిన పిల్లలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మధ్యాహ్న భోజనం సరిగ్గా లేకపోతే తల్లిదండ్రులకు చెప్పాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల పిల్లలు, పక్కింటి పిల్లలు చదువుల్లో ఎదిగిపోతున్నారని మనమెందుకు చదవకూడదని, అనుకుని చదువుల్లో పోటీ పడితేనే భవిష్యత్తు అని విద్యార్థులకు సూచించారు. నాడు అరకొర చదువులు ఉన్న ప్రభుత్వ బడుల్లో చదువుకుని గొప్పవాళ్లు, మేధావుల గురించి తెలిపారు. ప్రస్తుతం నేటి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తూ విద్యాబుద్ధులు చెబుతున్నా కొంత మంది విద్యార్థులు సరిగ్గా చదువుకోవడం లేదని తెలిపారు. పేదవాడికి చదువే ఆయుధమన్నారు. చదువును పట్టుకొని పరుగెడితే ప్రపంచాన్ని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

పండుగలకు ఆంక్షలు సరికాదు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరాములు

మీర్‌పేట: పండుగలు, ర్యాలీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. మీర్‌పేట కార్పొరేషన్ నందిహిల్స్‌లో అరుణాచలేశ్వర స్వామి ఆలయ 5వ వార్షికోత్సవంలో స్థానిక కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతి నర్సింహ్మతో కలిసి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బట్టేల్ గుట్టపై కాషాయ జెండా ఎగురవేస్తామంటే కేసులు నమోదు చేయించిన ఘనత మంత్రి సబితా రెడ్డికే దక్కుతుందని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధీరజ్‌రెడ్డి, తిరుపతిరెడ్డిచ నర్సింహారెడ్డి, అశోక్, గోపీనాథ్, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, విక్కీ సాగర్, మల్లికార్జున్, రవి, శ్రీను, శేఖర్, మనోజ్ ఆలయ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న శ్రీరాములు యాదవ్, శివపార్వతి, తదితరులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన

మీర్‌పేట: పట్టణంలోని భాష్యం లిటిల్ చాంప్స్ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ప్రముఖ శాస్త్రవేత్త లలిత వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాలలో సత్తా చాటాలని ఆమె సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ స్రవంతి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ శ్రుతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా విజయచాముండీ హోమం

హస్తినాపురం: డిఫెన్స్‌కాలనీలోని శ్రీహరి హరక్షేత్ర అయ్యప్ప స్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవరోజు ఆదివారం విజయ చాముండీ హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో పూజలు ముగిశాయి. కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఆలయ వ్యవస్థాపక చైర్మన్, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా సీఎంఆర్ఎఫ్

పహాడీషరీఫ్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని బడంగ్‌పేట్ 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ అన్నారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆదిల్ల పృథ్వీరాజ్‌కు మంజూరైన రూ.36 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా మంత్రి సిఫారసుతో ఎప్పటికప్పుడు డబ్బులు మంజూరు అవుతున్నాయన్నారు. చికిత్స కోసం డబ్బులు ఖర్చు చేసుకున్న పేద వారికి ఎంతో వెసులుబాటుగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మంత్రి సబితా రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, నాయకులు యాతం బాలరాజ్ యాదవ్, మంకాల శ్రీశైలం, వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ యాదవ్

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ ఆకాంక్షించారు. ఆదివారం సరూర్‌నగర్‌లోని శ్రీ విద్యా విహార్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె సినీనటి మైథిలీరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో ఉన్న ఆలోచనలు, ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కే శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ భారతి, కార్తీక్, కందికంటి పండరీనాథ్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, సినీ నటి మైథిలీరాజ్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సరికాదు

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని బీఎస్పీ ఎల్‌బీ నగర్ నియోజకవర్గం ఇంచార్జి జక్క యాదగిరి ఆరోపించారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం నార్త్, ఇంద్రప్రస్థకాలనీ, పద్మావతి కాలనీల్లో ప్రజలతో కలిసి మార్నింగ్ వాక్ చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో డ్రైనేజీ, వరదనీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మాటమార్చింది



పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సంగ్రామ యాత్రలో ఎమ్మార్పీఎస్ శ్రేణుల ధ్వజం

యాచారం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మాల్ కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్ శ్రేణులు మాదిగల సంగ్రామ పాదయాత్ర చేపట్టారు. మాల్, నల్లవెల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో నాయకులు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ (ఏబీసీడీ) వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మాటమార్చిందని అన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైన ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నర్సింహ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్ పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే రూ. 2లక్షల రుణమాఫీ

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే రైతులకు రూ.2 లక్షల పంట రుణాల మాఫీతో పాటు, రూ.5లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు, రూ.500కే వంటగ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయనుందని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని చల్లంపల్లి, వంపూగూడ గ్రామాల్లో కొనసాగిన పాదయాత్రలో వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్ సేవ్యా, గ్రామ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు ఉన్నారు.

కష్టపడే వారికి గుర్తింపు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన యాట నర్సింహ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన బిచ్యానాయక్‌ను, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు రాములు, పాండునాయక్, సేవ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు ఉన్నారు.



కడ్తాల్: కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న వంశీచంద్‌రెడ్డి

గ్యాస్ ధరలు తగ్గించాలి

మంచాల: మండల పరిధిలోని ఆస్మత్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని ఆదివారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్, రాజు, లింగంగౌడ్, మంతని వెంకటేష్, పర్వతాలు, సత్తయ్య, గణేష్,కృష్ణ, భాషయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.